# కడప-అన్నమయ్య

# వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 04 నవంబర్ 2025

## మహా ప్రసాదం వినియోగంతో ముగిసిన జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం నవంబర్ 03 ప్రభాతవార్త

భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానం రచించిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలు మహాప్రసాదం వినియోగంతో ముగిసినట్లు మేనేజర్ ఈశ్వరయ్యా చారి తెలిపారు. సోమవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మండల పూజలు విశేష హోమాలు శాంతి హోమం పూర్ణాహుతి నిర్వహించారు. గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు మహాప్రసాద అందించారు,అలాగే రాత్రి కార్తీక సహస్ర దీపార్చన, పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రి స్వామి, వీర భద్రయ్య స్వామి, వీరంభట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి వారి సతి సమేతంగా మరియు మహిళలు భక్తులు పాల్గొన్నారు.




## శివాలయాల్లో ప్రత్యేక పూజలు

దువ్వూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:



మండల పరిధిలో వివిధ గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో ఆర్థిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాత దువ్వూరులో వెలసి ఉన్న శ్రీ భీమ లింగేశ్వర ఆలయం నందు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే గుడిపాడు, కానగూడూరు, దువ్వూరు, పొద్దుటూరు రహదారిలో ఉన్న శివాలయంలోనూ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సారి దువ్వూరు శివాలయంలో పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

### ఇంచార్జ్ మంత్రి జనార్దన్ రెడ్డి

# జాడేది ?

### జిల్లా ప్రగతి పై చొరవ ఏది ?



రాజంపేట - రాయచోటి రహదారి లో నిలిచిపోయిన పనులు

రాజంపేట, నవంబర్3 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల ప్రగతి, పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు సారథులను నిర్మించారు. జిల్లాలలో ప్రగతిని పరుగులు పెట్టించడం, ప్రధాన సమస్యలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉంటుంది. ఇది అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ మంత్రిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తనదైన ముద్రను వేయలేకున్నారు. నామ మాత్రం పర్యటనలతో కాలం గడుపుతున్నారు. సొంత శాఖ ద్వారా కూడా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. పార్టీపై దృష్టి కూడా అంతంత మాత్రమే కనిపిస్తోంది. ఇంచార్జ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఆయన జిల్లా అధికారులతో సమీక్షలు కానీ, ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవకాని చూపిన దాఖలాలు లేవు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనలు, మహానాడులో కొద్ది రోజులు ఉండడం, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల్లో రెండు రోజులు తళుక్కు మనిపించారు. ఆ తర్వాత పత్తా లేరు. మంత్రిగా మమ అనిపించారు. జిల్లాలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లాలో ఎన్డిబి నిధులతో చేపట్టిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆర్అండ్బి శాఖలో కూడా నిధుల లేమి జిల్లాకు కోట్టుకొచ్చేట్లు కనిపిస్తోంది. జిల్లా మంత్రిగా నిలిచిపోయిన పనులను ప్రారంభించేలా సమీక్షించిన పరిస్థితి లేదు. అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక ఇచ్చినా ఆ తర్వాత పరిస్థితి ఏమిటి అనేది ఇంతవరకు అతీగతి లేదు. జిల్లాకు చెందిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి సొంత నియోజకవర్గం పైనే దృష్టి సారించారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల అభివృద్ధిపై ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. హంద్రీనీవా పనుల పురోగతిలో ఆశించిన స్థాయిలో లేవు. మంత్రిగా జిల్లాలో సీఎం పర్యటనలు లేదా మహానాడు లాంటి కార్యక్రమాలు, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల్లో మాత్రమే తలుక్కుమనిపించి ఆ తర్వాత పత్తా లేకుండా పోయారు. జిల్లా అభివృద్ధిపై తనదైన ముద్ర వేయలేకపోయారు. జిల్లాలో పలానా పని తాను చేసినాననే పరిస్థితి చెప్పుకునేందుకు కూడా లేదు. పార్టీపై కూడా దాదాపు అదే స్థాయిలో వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయిలో సమీక్షలు లేవు. నియోజకవర్గాల్లో పార్టీలో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఉదాహరణకు తంబళ్లపల్లెలో పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోనే సంచలనం సచ్చిన నకిలీ మద్యం వ్యవహారంలో కూడా ఆశించిన స్థాయిలో నిర్ణయాలు తీసుకోలేదు. మదనపల్లెలో కూడా పార్టీలో విభేదాలు రచ్చ కెక్కాయి. రాయచోటిలో కూడా దాదాపు పరిస్థితి అంతేనని చెప్పవచ్చు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులో కూడా పార్టీ పరిస్థితిపై దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడింది. రైల్వే కోడూరు లో గ్రూపు రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. స్వయంగా నియోజకవర్గ ఇన్చార్జిని పార్టీ అధినేత ,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిలిచి మాట్లాడే పరిస్థితి ఏర్పడింది. రాజంపేట నియోజకవర్గం లో కూడా ప్రధాన సమస్యల పరిష్కారానికి ఆశించిన స్థాయిలో ఇన్చార్జ్ మంత్రి పని చేయలేదని చెప్పవచ్చు. ఆర్ అండ్ బి ,జాతీయ రహదారుల అభివృద్ధిలో ఇన్చార్జ్ మంత్రిగా జిల్లాలో ఎన్నో పనులు చేసేందుకు అవకాశం ఉన్నా ఆ స్థాయిలో ఎక్కడ కనిపించడం లేదు. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో దిశా నిర్దేశం చేసి జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకుపోవాల్సిన బాధ్యత జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా ఆయనకు బాధ్యత ఉంది. ఇకనైనా జిల్లా ఇంచార్జ్ మంత్రిగా జిల్లా అభివృద్ధిపై తన దైన ముద్ర వేసేలా పనిచేస్తారని ఆశిద్దాం.

## నేడు జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం

### ఇంచార్జ్ మంత్రి, జిల్లా మంత్రి రాక

రాజంపేట, నవంబర్3 ప్రభాతవార్త

రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం మంగళవారం జరగనుంది. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ లు పాల్గొననున్నారు. జిల్లా అభివృద్ధిపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి సమావేశంలో చర్చించనున్నారు.

## సాంకేతిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

పులివెందుల,నవంబర్ 3, ప్రభాత వార్త :



సమీక్ష సమావేశంలో పాల్గొన్న భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

విద్యుత్ రంగం సాంకేతిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి అని విద్యుత్ సరఫరాలో పారదర్శకత ఉండాలి అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. విజయవాడ, గుణదలలోని ఏపీ ట్రాన్స్ కో విద్యుత్ సౌధ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏపీ ట్రాన్స్కో పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షత వహించగా, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తో సహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో ట్రాన్స్ కో సంస్థ కార్యకలాపాలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, సాంకేతిక అభివృద్ధి, నిర్వహణ వ్యయాలు, ప్రాజెక్టుల పురోగతి, మరియు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించే చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత మరియు సమర్థత పెంపొందించుకోవడం అత్యవసరమని, రైతులు, పరిశ్రమలు మరియు గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించే దిశగా ట్రాన్స్ కో అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రంగంలో సాంకేతిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా అధికారులు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కో మేనేజింగ్ డైరెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు, విభాగా ధిపతులు పాల్గొన్నారు.

## పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కడప, నవంబర్ 3, ప్రభాతవార్త :



ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభ భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లా అధికారులు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అందించాలన్నారు.ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిరక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో పీజీఆర్ఎస్ పెండింగ్ అర్జీలపై సమీక్ష చేశారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

## అర్జీలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలి

రాయచోటిటౌన్, నవంబర్ 03: ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్నవి, సంక్లిష్టమైన అర్జీలను వదిలి పెట్టకుండా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్.ఎల్.ఎలోకి వెళ్లకుండా, సర్వీసు నాణ్యతతో సమస్యలను తీర్చాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కార పర్యవేక్షణను నేరుగా నిర్వహిస్తున్నదని, ప్రతి సమస్యను సీరియస్గా పరిశీలించాలన్నారు.అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎంపి

పులివెందుల, నవంబర్ 3 ప్రభాతవార్త :



ప్రజల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని ఏళ్ల వేళల ప్రజలకు అందుబాటులో ఉంటాను అని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణం లోని తన నివాసం వద్ద పెద్ద ఎత్తున ప్రజలు కార్యకర్త లు తరలి వచ్చారు. గంటల పాటు నిలబడి ప్రతి ఒక్కరి సమస్యను ఓపికతో వింటూ వారి సమస్యలను తెలుసు కొని పరిష్కారానికి అవకాశం ఉండే సమస్యలను అప్పటికప్పుడే చేరవాని ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.ఎవరు అధైర్యపడవద్దు అంతా మంచి జరుగుతుందని ప్రస్తుత కూటమి ప్రభుత్వ అరాచకాలు ఎక్కువ రోజులు కొనసాగావని అన్నారు. కార్యకర్తలకు ప్రజలకు ఏ సమస్య వచ్చిన ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఫేస్ వాష్ అండ్ గో

కడప క్రైం, నవంబరు 3, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. లారీలు, కార్లు, వ్యాన్లు, బస్సులు ఇతర వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సూచించారు.

## కడప నుంచి వరల్డ్ కప్ దాకా....

కడప, నవంబర్ 3, ప్రభాతవార్త



పేదరికం ఆమెను ఆపలేదు. శ్రీచరణి అసాధారణ ప్రయాణం.. ఆంధ్రప్రదేశ్లోని కడప జిల్లా ఎర్రమల్లె గ్రామానికి చెందిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. భారత మహిళల జట్టులో మెరిసింది. ICC Women"s Cricket World Cup 2025లో భారత్ విజేతగా నిలవడంలో ఆమె కీలక పాత్ర పోషించింది. మారుమూల పల్లెటూరు నుంచి రికార్డు సృష్టించిందామె. పేదరికం, కష్టాలు... అన్నిటినీ ఎదురించి దేశానికే గర్వంగా మారింది. ఐసీసీ మహిళల విభాగంలో భారత్కు మొట్టమొదటి ప్రపంచ కప్ అందించింది. ఆమెనే మహిళా క్రికెటర్ శ్రీ చరణి.. ఆంధ్రప్రదేశ్లోని కడప జిల్లా క్రీడా రంగంలో పెద్దగా పేరున్న ప్రాంతం కాదు. కానీ, ఈ జిల్లాలోని వీరపునాయిని మండలం ఎర్రమల్లె గ్రామం నుంచి వచ్చిన నల్లపురెడ్డి. శ్రీ చరణి.. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పురుషుల లేదా మహిళల క్రికెట్లో ప్రపంచ కప్లో ఆడిన మొట్టమొదటి క్రీడాకారిణిగా నిలిచింది. కానీ, ఆమె ప్రయాణం అనేక కష్ట నష్టాల మధ్య సాగింది. 21 ఏళ్ల ఈ యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ క్రికెట్లోకి చాలా ఆలస్యంగా అడుగుపెట్టింది. వాస్తవానికి క్రికెట్ ఆమె మొదటి లక్ష్యం కాదు. చిన్నతనంలో ఆమె బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్లో ప్రతిభ చూపింది. అయితే 16 ఏళ్ల వయస్సులో మాత్రమే ఆమె క్రికెట్ను సీరియస్గా తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయానికి ఆమె మావయ్య కిషోర్ కుమార్ రెడ్డి ప్రధాన కారణం. ఆమె క్రికెట్ను ఎంచుకోకపోవడానికి ప్రధాన అడ్డంకులు ఆర్థిక సమస్యలు, కుటుంబం నుంచి మొదట్లో వచ్చిన వ్యతిరేకత. ఆమె తండ్రి చంద్రశేఖర్ రెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్లో చిన్న ఉద్యోగిగా పనిచేసేవారు. క్రికెట్ జట్టు ఎక్కువగా పురుషుల క్రీడ కావడంతో ఆమె తండ్రి మొదట్లో చరణి నిర్ణయానికి మద్దతు ఇవ్వలేదు. తండ్రిని ఒప్పించడానికి ఆమెకు ఏడాది కాలం పట్టింది. చరణి చెప్పిన ప్రకారం.. ఆమె క్రీడా జీవితాన్ని ప్రారంభించే సమయంలో తన కుటుంబం అప్పులతో బాధపడేది. అయినప్పటికీ ఆ కష్టాలు తన ఆటపై ప్రభావం చూపకుండా ఆమె తల్లిదండ్రులు సహకరించారు. క్రీడా జీవితం ప్రారంభంలో శ్రీ చరణి మొదట ఫాస్ట్ బౌలర్గా శిక్షణ పొందింది. ఫాస్ట్ బౌలింగ్లో వికెట్లు లభించకపోవడంతో స్పిన్ బౌలింగ్ను ప్రయత్నించగా కలిసొచ్చింది. ఆ తర్వాత ఆమె నెమ్మదిగా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్గా మారింది. కడప లాంటి మారుమూల ప్రాంతం నుంచి వచ్చి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ద్వారా సెలెక్టర్ల దృష్టిలో పడింది. అంతర్జాతీయ క్రికెట్కు ఎంపిక కావడం ఆమె అచంచలమైన పట్టుదలకు, కష్టపడే తత్వానికి నిదర్శనం. ఆర్థిక కష్టాలు ఆమె ఆశయాన్ని ఆపలేకపోయాయి.

## డిసెంబర్ నాటికి అన్ని మండలాల్లో కిచెన్ షెడ్స్ నిర్వహణలోకి రావాలి

కడప, నవంబర్ 3 ప్రభాతవార్త:



జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి డిసెంబర్ నాటికి అన్ని మండలాల్లో అమలులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై అన్ని డివిజన్ల ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు చేపట్టామని, ఇప్పటికే జిల్లాలో కడప నగరంలో స్మార్ట్ కిచెన్ మరియు సికె దిన్నె స్మార్ట్ కిచెన్ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని.. మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు అందులో ఇప్పటికే 23 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు ప్రారంభం అయి వివిధ దశల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన 10 స్మార్ట్ కిచెన్ల షెడ్ల నిర్మాణ పనులను కూడా రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఇందులో స్థల కేటాయింపు, ఇసుక, కంకర సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే.. పరికరాల కోసం టెండర్, కొనుగోలు మొదలైన అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో సిపిఓ హాజరతయ్య, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిఇఓ శంషుద్దిన్, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, హౌసింగ్ పీడి రాజరత్నం, సమగ్ర శిక్ష ఏపిసి నిత్యానంద రాజు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కడప క్రైం, నవంబరు 3, ప్రభాతవార్త:



వైఎస్ఆర్ కడప జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 223 ఫిర్యాదులు పీజీఆర్ఎస్కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఓం నమ:శివాయ అంటూ శివాలయాలకు పోటెత్తిన భక్తులు





ఊట్కూరులో నాగలింగేశ్వర స్వామి, రాజంపేటలో అయ్యప్ప స్వామి, దీపాలు వెలిగించేందుకు వచ్చిన మహిళలు

రాజంపేట, నవంబర్3 ప్రభాతవార్త

రెండో కార్తీక సోమవారం భక్తులతో శివాలయాలు పోటెత్తాయి. భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు తరలివచ్చారు. రాజంపేట మండలం ఊట్కూరులో శివ భక్తుడు భక్తకన్నప్ప జన్మస్థలిలో నాగలింగేశ్వర స్వామి ఆలయంమహిళా భక్తులతో పోటెత్తింది. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక సిద్దేశ్వర సమయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాజంపేట నాగలింగేశ్వర రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రాజంపేట పట్నం జాతీయ రహదారిపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు కార్తీక మాస పూజల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లవారుజామున అయ్యప్ప మాల దీక్ష పరులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చారు గురుస్వామి కొండ సత్యనారాయణ భక్తులకు అయ్యప్ప మాలధారణ చేశారు. రాత్రి అయ్యప్ప భజనలో భక్తులు పాల్గొని అనంతరం భిక్ష స్వీకరించారు.

## భక్తజనంతో కిటకిటలాడిన పొలతల క్షేత్రం




పెండ్లిమర్రి, నవంబరు 3, ప్రభాతవార్త:

భక్తజనంతో పొలతల క్షేత్రం కిటకిటలాడింది. సోమవారం శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం 2వ కార్తీక సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ పొలతల క్షేత్రాన్ని పర్యవేక్షించారు. క్యూలైన్లు, దేవస్థాన పరిసర ప్రాంతాలు, కోనేర్లు పర్యవేక్షించి ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణనాయక్కు తగు సూచనలు చేశారు. ఉప కమిషనర్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం మరియు డిపార్టుమెంట్ తరుపున భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సులువుగా దర్శనం కలిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.అర్చకులు శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడం జరిగింది. భక్తిశ్రద్ధలతో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు మల్లికార్జున స్వామి, అక్కదేవతలు, బండెన్న, పుట్టాంజనేయ స్వామి, కాశీనయన స్వామి వార్లకు వైభవంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ నాయక్, ఆలయ చైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం నేపథ్యంలో పటిష్ట బందోబస్తు

కడప క్రైం, నవంబరు 3, ప్రభాతవార్త:



జిల్లాలోని ప్రముఖ ఆలయాల వద్ద కార్తీక సోమవారం నేపథ్యంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకునే దేవాలయాలైన ఖాజీపేట పరిధిలోని నాగనాదేశ్వర స్వామి ఆలయం, మైలవరం పరిధిలోని అగస్తేశ్వర స్వామి ఆలయం, పులివెందుల పరిధిలోని నామాలగుండు, సిద్దేశ్వర స్వామి ఆలయం, జమ్మలమడుగు పరిధిలోని కన్నెతీర్థం ఆలయాల వద్ద ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులతో మాట్లాడి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. క్యూలైన్లు సజావుగా సాగేలా మైక్ అనౌన్స్మెంట్ ద్వారా, మెగా ఫోన్స్ తో ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన బారికేడింగ్ ఉండేలా తగిన చర్యలు తీసుకున్నారు. ఇతర శాఖలైన దేవాదాయ, విద్యుత్తు, పంచాయతీ, పురపాలక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు అధికారులు విధులు నిర్వహించారు. ఆలయాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. చైన్స్నాచింగ్, జేబు దొంగతనాలు జరగకుండా క్రైం పార్టీ బృందాలను రంగంలోకి దించారు. వేకువ జామున వెళ్లే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నైట్ బీట్లను, బ్లూకోల్ట్స్, రక్షక్ బృందాలను అప్రమత్తం చేశారు. ఆలయాల వద్ద ఉదయం, సాయంత్రం అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చిన ఘనత వైసీపీకే దక్కుతుంది

బద్వేల్ అర్బన్, నవంబర్ 3, ప్రభాతవార్త





వైసిపి హయాంలో రాష్ట్ర ప్రజలకు 7 మెడికల్ కళాశాలలు అందుబాటులోకి తేగా అందులో ఐదు పూర్తయి, మిగతా రెండు కూడా పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా అందుబాటులోకి తేలేకపోయామని ఎమ్మెల్సీ డీ.సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధలు తెలిపారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డు భావనారాయణనగర్ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తున్నారని, ఇది పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనన్నారు. లక్షల కోట్ల ఆదాయం వచ్చేలా చంద్రబాబు తన బంధువులు, పార్టీ వాళ్లకు కళాశాలలను హస్తగతం చేయడానికి కుట్ర చేస్తున్నారనీ, కూటమి నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు పేదలకు వైద్య విద్య దూరం అవుతుందనీ ఆరోపించారు. మెడికల్ కళాశాలల పట్ల కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌ను కలిసి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారులు మరియు మున్సిపాలిటీ అబ్జర్వర్లు నాగార్జున రెడ్డి, లయన్ భాస్కర్ రెడ్డి, అంబవరం వైఎస్ఆర్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల వల్లె శేఖరరెడ్డి మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోసుల కృష్ణ, గోపాలస్వామి, మున్సిపాలిటీ పార్టీ కన్వీనర్ సుందర్ రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మరియు పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు, కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల నాయకులు, మాజీ డైరెక్టర్లు, పార్టీ మహిళా నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భూమాఫియాపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త



సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లి పరిధిలోని బీ.కే.పల్లి కొల్లబైలు ప్రాంతాల్లో జరుగుతున్న భూ మాఫియా కార్యకలాపాలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్‌కు భూ మాఫియాపై ఫిర్యాదు అందజేశారు. అనంతరం పునీత్ కుమార్ మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, నకిలీ పట్టాలు సృష్టించి, భూ వివాదాలను సృష్టించి, ఆ తర్వాత వాటిని పరిష్కరించే నెపంతో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. దీని ద్వారా నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని తెలిపారు. సర్వే నెంబర్ 539/1ఏ లో ఉన్న భూమిలో నిర్మాణాలు కూడా చేపడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు శ్రీనివాసులు, ఆది, జిలాని, వినయ్, జగదీష్, సాయి కిరణ్, మనీష్, దేవేష్, సంతోష్, సుబ్రహ్మణ్యం, గుణశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత రక్తవర్గీకరణ

మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లిలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సోమవారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు ఉచిత రక్త వర్గీకరణ నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మాట్లాడుతూ చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుండాలని, మదనపల్లి పట్టణంలో హెల్పింగ్ మైండ్స్ సేవలు ఆదర్శనీయమన్నారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తమ బ్లడ్ గ్రూప్స్ తెలుసుకోవాలని, రక్తదాన ఆవశ్యకత తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, సమీర్, అమీన్, సైసావలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

### అజెండాలో ఉన్న అంశాలన్నీ ఆమోదం

మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ప్రశాంతంగా ముగిసింది. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్ పర్సన్ మనూజా రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వార్డుల్లో ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అత్యవసర పనులైతే అధికారులతో చర్చించి వెంటనే చేపడతామన్నారు. వైస్ చైర్మన్‌ను నూర్ అజాం మాట్లాడుతూ తన వార్డులో నీటి సమస్య అధికంగా ఉందని నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ షబానా కరీముల్లా మాట్లాడుతూ తను వార్డులో పారిశుద్ధం అధ్వానంగా ఉందని నీటి సమస్య అధికంగా ఉందన్నారు. నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ మోబినా మాట్లాడుతూ తన వార్డులో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం నాసికంగా పనులు జరుగుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు కాజా, ప్రసాద్ లు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. మురికినీటి కాలవల్లో డీసెల్టింగ్ చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కొరత తీర్చాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వల్లే వార్డుల్లో రోడ్లు అద్వానంగా ఉన్నాయన్నారు. కౌన్సిలర్లు చర్చించిన ప్రజా సమస్యల చర్చానంతరం అజెండాలో పేర్కొన్న ఆరు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఈ, శ్రావణి, అన్ని శాఖల అధికారులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వైకాపా రైతుకమిటీ సభ్యుడిగా వెంకటరమణారెడ్డి

తంబళ్లపల్లె నవంబర్ 3 ప్రభాతవార్త ః



రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు కమిటీ సభ్యుడుగా తంబళ్లపల్లె మాజీ ఎంపీపీ పి.జే. వెంకటరమణారెడ్డిని అధిష్టానం ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు రేపన చౌడేశ్వర తెలిపారు. సోమవారం ఎంపీపీ చిటికి శ్యామలమ్మ సమక్షంలో రైతు రాష్ట్ర కమిటీ సభ్యుడు పీజే వెంకటరమణారెడ్డి, జిల్లా రైతు విభాగ కార్యదర్శి బోడ్రెడ్డిరెడ్డి వారి కోట భాస్కర్‌రెడ్డి, బూత్ కమిటీ సభ్యుడిగా డి నరేందర్ రెడ్డి, జిల్లా బీసీ కమిటీ అధ్యక్షుడుగా రామ్మూర్తిలను వైకాపా నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పీజే వెంకటరమణారెడ్డి, సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇచ్చిన ఈ పార్టీ పదవికి కృతజ్ఞతులను ప్రకటించి మండలంలో వైకాపా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, ఆధార్ మల్లి రాయల్, ప్రత్యేక ఆహ్వానితుడు ఎరుకుల రెడ్డి, మల్లయ్య కొండ మాజీ చైర్మన్ మల్ రెడ్డి, ఎంపీటీసీలు మహేష్, కరీం, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వీరభద్ర, అలీ, జయ నారాయణరెడ్డి, చిన్నపరెడ్డి, రెడ్డి మల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సిమెంట్ రమణారెడ్డి, ఖాదర్ బాషా, అమర్నాథ్ రెడ్డి, తులసినాయక్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మదనపల్లె క్రైమ్, నవంబర్ 3 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మదనపల్లిలో చోటుచేసుకుంది. మదనపల్లి రూరల్ మండలం సిటిఎంకు చెందిన రమణ కుమారుడు విజయ్ కుమార్ (47) తరిగొండ ఆయుష్ హాస్పిటల్ లో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి గత నెల 25న కోతి అడ్డు రావడంతో ద్విచక్రవాహనం నుండి కిందపడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తుండగా సోమవారం మృతి చెందాడు. మృతదేహానికి శవ పరీక్షలు పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తాలుక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయాలి

ఎడ్యుకేషన్, నవంబర్ 3, ప్రభాతవార్త

మెగా డీఎస్సీ 2025 కు ఎంపికైన సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సచివాలయాలలో పనిచేస్తున్న వారు మెగా డీఎస్సీలో నియామకం పొందారని, కాని నెలరోజులైన నేటికి వారిని రిలీవ్ చేయలేదన్నారు. కావున వీరి సమస్యను పరిష్కరించి వారికి రిలీవ్ ఉత్తర్వులు ఇప్పించేందుకు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శి ఎస్.ఏజాస్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవిజేతగా మహిళా జట్టుపై ప్రశంసలు

కడప కార్పొరేషన్ నవంబర్ 3 ప్రభాతవార్త:

మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన టీమ్ ఇండియా రూ.39 కోట్ల ప్రైజ్ మనీ ని సొంతం చేసుకుంది. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ హర్మన్ సేన ఛాంపియన్ గా అవతరించింది. భారత జట్టుపై కడప జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, సంఘ సభ్యులు విక్టర్, శివకృష్ణ, ఆగిరప్ప ప్రశంసల జల్లు కురిపించారు. ముఖ్యంగా కడప జిల్లా పౌరుషాన్ని యావత్ ప్రపంచానికి శ్రీచరణి చాటి చెప్పిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గౌరవాన్ని భారతదేశానికి చాటి చెప్పిన గొప్ప మహిళా క్రీడాకారిణి శ్రీచరణి అని చెప్పారు. భారతదేశ కీర్తి కిరీటంలో తన పేరును లిఖించుకున్న శ్రీ చరణినీ ప్రశంసించారు.

## లైబ్రరీకి 50 పుస్తకాలు వితరణ

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 03 ప్రభాతవార్త



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు దాత లైన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య 50 పుస్తకాలను వితరణ చేయగా వాటిని సోమవారం ఏపీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ప్రిన్సిపాల్ వరాల రమేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాలు జ్ఞానోదయాన్ని అందజేస్తాయని ప్రతి విద్యార్థి పుస్తకాలు చదివి గొప్ప వక్తలు కావాలన్నారు. మీ జీవితం మీ చేతుల్లో అనే పుస్తకాన్ని పుస్తకాలను వారు పాఠశాలకు అందజేశారు ఈ పుస్తకం విద్యార్థి దశ నుంచే ఎంతో బార్పు తెస్తుందని ప్రతి విద్యార్థి ఈ పుస్తకాలను కచ్చితంగా చదవాలని ప్రిన్సిపాల్ వరాల రమేష్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉపాధ్యాయులు నాగయ్య పాల్గొన్నారు.

## వెలిగల్లు ప్రాజెక్టు నీరు దొరి చెరువుకు

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 03, ప్రభాత వార్త



గంగకు పూజలు చేస్తున్న మాతా నందగిరి స్వామి

ఆగస్టులో వెలుగల్లు ప్రాజెక్టు నుంచి పొడి కాల ద్వారా రామాపురం లక్కిరెడ్డిపల్లి మండలాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విడుదల చేశారు. ఈ నీరు సోమవారం లక్కిరెడ్డిపల్లె గ్రామానికి త్రాగునీరు అందించే దొరిచెరువుకు చేరుకున్నాయి. దీంతో సోమవారం మాతాంగ పీఠాధిపతి మాతానందగిరి స్వామి గంగకు పూజలు నిర్వహించి ఆరాధన పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరి చెరువు నిండితే లక్కిరెడ్డిపల్లె గ్రామానికి త్రాగునీరు ఎంతో ఉపయోగపడుతుందని బోరలో నీరు చేరుకొని రెండు సంవత్సరాలపాటు త్రాగునీటి సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు మాజీ జెడ్పిటిసి మోహన్ రెడ్డి మాతాంగా పీఠాధిపతి భక్తులు పాల్గొన్నారు.

## గిరిజన నాయకుడు వేడుకలు నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 03, ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్ నాయుడు

గిరిజన నాయకుడు స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ శ్రీ దీర్ష ముండ పేరున ఈనెల ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు జన్ జాతీయ గౌర దినోత్సవం వేడుకలు నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ టీవీఎస్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన గిరిజన ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వం వాటి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అలాగే లక్కిరెడ్డిపల్లి మండలంలోని లక్కిరెడ్డిపల్లి బి ఎరిగుడి గ్రామాలను ఎంపిక చేసామని ఈ గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. అంతేకాకుండా ఎక్కడైనా గిరిజన ప్రాంతాలు ఉంటే ఆ ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి అధికారి గిరిజన ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారిని తేజస్వి, ఎంపీడీవో రెడ్డయ్య ఈవోపీఆర్డి ఉషారాణి పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్‌రెడ్డి, నాగమణి, రజనీస్‌రెడ్డి, వెంకటరమణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నేత జహీర్ పై అక్రమ కేసులు

కడప కార్పొరేషన్ నవంబర్ 3 ప్రభాతవార్త:



వైసిపి కోఆప్షన్ సభ్యులు జహీర్‌పై అసత్య ఆరోపణలు తగదని 27 డివిజన్‌కు చెందిన మహిళలు బి.బుజ్జమ్మ, మరియమ్మ, తులసమ్మ, మునెమ్మ, సుజాతమ్మలు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి జహీర్ తమ డివిజన్ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం చేస్తాడని తెలిపారు. టిడిపికి చెందిన కొంత మంది జహీర్‌ను అప్రతిష్ట పాలు చేసేందుకు కుట్ర పన్ని అసత్య ఆరోపణలు చేయడం, కేసులు పెట్టడం జరిగిందని చెప్పారు. జహీర్‌పై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పల్లె కొండు సంపత్ కుమార్, ఆ పార్టీ మహిళా నాయకురాలు చైతల్యలతో పాటు 50 మహిళలు పాల్గొన్నారు.

## బకాయిలు పూర్తిగా చెల్లించేవరకు రిలేదీక్షలు

ప్రొద్దుటూరు నవంబర్ 03, ప్రభాతవార్త



ప్రొద్దుటూరులో దసరా వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న మున్సిపల్ ఎగ్జిబిషన్ వేలంపాటను దక్కించుకున్న గుత్తేదారుడు బకాయిలు పూర్తిగా చెల్లించేంత వరకు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఈనెల 4 నుండి వైసిపి రిలే నిరాహార దీక్షలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్ నిర్వహణను స్థానిక ఎమ్మెల్యే వరద ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డి అండతో గుత్తేదారుడు అధిక ప్రవేశ రుసుముతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని, అయినా వేలంపాట ద్వారా దక్కించుకున్న సొమ్మును పూర్తిగా చెల్లించకపోయినా మున్సిపల్ కమిషనర్ అనుమతులు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. గెజిట్ నిబంధనలను ఉల్లంఘించి మున్సిపల్ కమిషనర్ టిడిపి నాయకులకు వత్తాసు పలుకుతూ పూర్తిగా చెల్లించక పోయిన అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ మున్సిపల్ కమిషనర్ పై నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తాము కోర్టును ఆశ్రయించామని కోర్టు అధికారులను మందలించిందని తెలిపారు. గుత్తేదారుడు బకాయిలను చెల్లించక పోగా రాత్రి వినోద పరికరాలను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన వివరించారు. మున్సిపల్ అధికారులు గుత్తేదారుల దగ్గర పూర్తిగా బకాయిలను వసూలు చేయాలని, వసూలు చేసేంతవరకు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మంగళవారం నుండి వైసీపీ ఆధ్వర్యంలో తామంతా రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి కౌన్సిలర్లు గుర్రం లావణ్య, మహిళా నేతలు పాల్గొన్నారు.

## పోలీసుల చర్యలకు స్పందన

పెనగలూరు నవంబర్ 3 ప్రభాతవార్త



ఆవులను స్వచ్ఛందంగా పట్టకుంటున్న యజమానులు

మండల కేంద్రంలో గత నాలుగు రోజుల క్రిందట పెనగలూరు పోలీసులు రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్న ఆవులను యజమానులు ఇళ్ల వద్దనే ఉంచుకోవాలని లేనియెడల స్వచ్ఛందంగా గోశాలకు తరలిస్తామని దండోరా వేయించడంతో మూడు రోజుల నుంచి ఆవుల యజమానులు ఆవులను రోడ్లపైకి రాకుండా జాగ్రత్త పరుచుకునే చర్యలలో నిమగ్నమయ్యారు. సోమవారం నాటికి చివరి హెచ్చరిక గడువు కావడంతో గోవుల యజమానులు కూలీ డబ్బులు ఇచ్చి మనుషులను పెట్టుకొని ఆవులను బంధించి కట్టడి చేసుకునే పనిలో ఉన్నారు. ఏదిఏమైనాప్పటికీ ఆవుల తాకిడి తగ్గనుందని ప్రజలు అనుకుంటున్నారు.

## స్మశాన వాటికకు స్థలం చూపించండి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 3 ప్రభాతవార్త:



స్వరాజ్య నగర్, సంజీవ నగర్, ప్రాంతాలలో నివసించు మాల మాదిగల శ్మశాన వాటిక లేక పోవడం వలన, చనిపోయిన వారిని ఎక్కడ సమాధి చేయాలో తెలియని ఇబ్బందికర పరిస్థితులు వున్నాయని, సదరు ప్రాంతంలో ఎక్కడైనా శ్మశాన వాటికకు స్థలం కేటాయించలని సోమవారం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు చలపతిరావు తహసిల్దార్ గంగయ్యను వినతి పత్రం ద్వారా కోరారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా దళితులు నివసిస్తున్నారని, సదరు ప్రాంతంలో శ్మశానవాటిక లేనందున, ఎవరైనా మరణించిన వారిని ఎక్కడ పుడ్చాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని సదరు ప్రాంతంలో ఇన్ని వేల మంది నివసిస్తున్న జనాభాకు స్మశాన వాటిక లేనందువలనే పరిస్థితి దారుణంగా వుందన్నారు.

## వైభవంగా దర్గా ఉరుసు గంధం

రామసముద్రం నవంబర్ 3 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని రాగిమాకులపల్లె క్రాస్ సమీపంలో ఉన్న హజ్రత్ పీర్ మహ్మద్ మున్వర్ అలీషా ఖాధరీ 20వ గంధం ఉరుసు సోమవారం నిర్వహించారు. దర్గాను బెంగళూరు నుండి పలు రకాల పుష్పాలు తెచ్చి దర్గాని అలంకరణ చేసి విద్యుత్ కాంతుల నడుమ భక్తి శ్రద్ధలతో ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఉరుసు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఫీర్ సయ్యద్ ఖాదర్ ఆలీషా ఖాధరి సాహెబ్ పాల్గొన్నారు. ఈ గంధం ఉరుసు తిలకించడానికి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుండి అధిక సంఖ్యలో వీక్షి ంచారు. ప్రత్యేకంగా హైదరాబాద్ బృందం సయ్యద్ ఆఖిల్, షఖిల్ వార్ సి వారిచే గొప్ప కావ్వాలీ జరిగింది. దర్గా కమిటీ సభ్యులు హజ్రత్ ఫీర్ (ఆర్ ఏ )ఖలీషా హజ్రత్, సయ్యద్ రెహమాన్ షా ఖాధరి (ఆర్ ఏ )ఫీర్ సయ్యద్ ఖాదర్ ఆలీషా ఖాధరి సాహెబ్, ఖాధరి చమన్, కార్యనిర్వాహకులు హజ్రత్ మొహ్మద్ మున్వర్ ఆలీషా ఖాధరి ఆర్ ఏ కుటుంబ సభ్యులు మరియు గురు బోధాలు తీసుకున్న శిష్యులు ఈ ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు దర్గా కుటుంబ సభ్యులు, గురు బోధాలు తీసుకున్న శిష్యులు వారి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డ్ నందు ఐడియల్ స్కూల్ వద్ద రూ.35 లక్షలతో సీసీరోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద 30 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముక్తియార్, మున్నా, మున్సిపల్ డిఈ రాజేష్, రాయల్ గౌస్, అన్సర్, ఖలీల్, మాజీ కౌన్సిలర్ సూర్యనారాయణ రెడ్డి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, రవి, చైతన్య, జనసేన జిలాన్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తులకు బిక్ష

పీలేరు నవంబర్ 3 ప్రభాతవార్త:



కలికిరి పట్టణం స్థానిక బీడీ కాలనీ వద్ద ఆలయంలో అయ్యప్ప భక్తులకు మెకానిక్ ఖాదర్ వల్లి ఆధ్వర్యంలో బిక్ష ఏర్పాటు చేశారు. పతి సంవత్సరం ఒక ఆనవాయతి గా నిర్వయిస్తున్న కార్యక్రమం గొప్ప శుభసూచికం అని గురు స్వాములు పేర్కొన్నారు, అందరు పూజించే మార్గాలు వేరైనా హిందూ ముస్లిమ్స్ కలసి మెలసి ఉండటం ఒక అదృష్టం అన్నారు. స్టార్ యస్పియస్ ఎలక్ట్రానిక్స్ పఠాన్ రెడ్డి బాషా అభిప్రాయపడ్డారు, ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమలు చేయాలనీ పలువురు పెద్దలు సూచించారు, మణి, ద్వారకానద రెడ్డి, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, టీపీ షాప్ రెడ్డి బాషా, దస్తగిరి, టీ స్టాల్ అలీ, ముక్తదా, ఫైజన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

వీరపునాయునిపల్లి, నవంబర్ 03, ప్రభాతవార్త:



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల నందు అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో బాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది.ఈ పోటీలో గెలుపొందిన బాలికలకు బహుమతులను ఉన్నత పాఠశాల హెచ్ఎం, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఐకెపి ఏపిఎం బహుమతులను వారి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన గంగ

పీలేరు నవంబర్ 3 ప్రభాతవార్త:



బోర్ లో నుంచి వస్తున్న నీళ్లు

పీలేరు నియోజకవర్గం కలికిరి మండలంలోని కలికిరిలో ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ బోర్లలో నీరు పెల్లుబికి వస్తోంది. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ హెచ్ ఆనందరెడ్డి వ్యవసాయ బోర్లు రెండు గజ్జెలవారిపల్లి సమీపంలో ఉన్నాయి. ఇవి రెండు కూడా ఒక్కొక్కటి వెయ్యి అడుగులకు పైగా లోతు ఉన్నాయి. ఇవి రెండింటిలోను సోమవారం ఉదయం నుండి ఏకధాటిగా నీరు పెల్లుబికి వస్తోంది. స్థానికులంతా బోర్లవద్దకు వచ్చి తిలకిస్తున్నారు. దీంతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉమామహేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు

గాలివీడు, నవంబర్ 3(ప్రభాతవార్త):



కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గండిమడుగు పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. రెండవ సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రాతః కాల సమయం నుంచి స్వామి వారికి అభిషేకాలు అర్చనలు తదితర పూజాక్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. అంతేగాక మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించి సామూహిక వ్రతాలు నిర్వహించారు.

## మునయ్య కోనలో ప్రత్యేక పూజలు

ముద్దనూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ముద్దనూరు జమ్మలమడుగు ప్రధాన రహదారి సమీపంలో నీ మునయ్య కోనలో కార్తీక మాసం రెండవ సోమవారం అవ్వడం వలన భక్తులు స్వామి వారిని పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో, భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## కాపర్దీశ్వరకోనలో ప్రత్యేక పూజలు

సిద్ధవటం నవంబర్ 3 ప్రభాతవార్త



మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని లంకమల అటవీ ప్రాంతంలో వెలసిన కపర్దీశ్వర కోనలో రెండవ కార్తీక సోమవారం భక్తుల రద్దీతో కిటకిట లాడింది ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ప్రత్యేక అభిషేక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని ఆజ్ఞ లేనిదే, చీమ అయినా కుట్టదని దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువైన కాపర్దీశ్వరుడు కపర్దీశ్వరుని ఆశీస్సుల కోసం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. ఆలయ అర్చకులు ఈశ్వరయ్య ఆలయ సంప్రదాయాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, జనసేన పార్టీ నేతలు అతికారి చిన్న వెంకటయ్య రమణ, సిద్ధవటం సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య ఉపసర్పంచ్ హిదాయతుల్లా పోలిశెట్టి శ్రీనివాసులు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ మునిస్వామి, పసుపులేటి గంగయ్య విజయ్, నిమ్మకాయల జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ మహబూబ్ బాషా, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఎన్.ఎం.ఎం.ఎస్ మెటీరియల్ ఆవిష్కరణ

సిద్ధవటం నవంబర్ 3 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడమే ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష ఉద్దేశ్యమని సిద్ధవటం మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మరియు మాజీ శాసనమండలి సభ్యులు కే.ఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్.ఎం.ఎం. ఎస్ పరీక్ష స్టడీ మెటీరియల్ ను సోమవారం ఆయన స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో జె.వి.వి, యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మండలంలో పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న జెవివి మరియు యుటిఎఫ్ నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ భాష మాట్లాడుతూ ఈమెటీరియల్ విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని, మంచి ఫలితాలు సాధించడానికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, డాక్టర్ హరి కొండయ్య, రామకేశవ, సుధాకర్ రెడ్డి మరియు నలంద హై స్కూల్ ప్రిన్సిపాల్ బాలుగారి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు

వేంపల్లి: నవంబర్ 03 ప్రభాత వార్త:



కూడు, గూడు, గుడ్డ ఈ మూడు మానవుని కనీస అవసరాలు. ఈ వాస్తవాన్ని గుర్తించి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975లోనే 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ స్ఫూర్తితో 2004-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు దాదాపు 60 లక్షల ఇల్లు నిర్మించి ఇవ్వడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు కూటమి ప్రభుత్వం ఈ 17 నెలల్లో పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోవడం శోచ నీయం. గృహ నిర్మాణానికి పట్టణాలలో రెండు సెంటు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం మంజూరు చేస్తాం. ఇప్పటివరకు మంజూరై పట్టాలు పొందిన వారికి ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం అని కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడం జరిగింది. కానీ ఈ హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో మహిళల కోసం పొందుపరచిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల నిర్మాణంలో ,మహిళా సంక్షేమం విషయంలో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేయాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పీలేరు రెవెన్యూ డివిజన్ కోసం విద్యార్థులు సంఘీభావం ర్యాలీ


రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు


మానవహారంగా ఏర్పాటు నిరసన తెలుపుతున్న దృశ్యం

**పీలేరు నవంబర్ 3 ప్రభాతవార్త:**
పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని పీలేరు సాధన సమితి జిల్లా కన్వీనర్ నడిమి కండ్రిక సుధాకర్‌బాబు అధ్యక్షతన ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు భారీగా మద్దతు లభిస్తుంది. నేటికీ రిలే నిరాహార దీక్ష 5వ రోజుకు చేరడంతో డీబీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బద్దే భాను ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు మాల తోటి నరేష్ లు విద్యార్థులతో కలిసి పీలేరు అంబేద్కర్ సర్కిల్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి పీలేరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అందరూ కలిసికట్టుగా నినాదాలు చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్యలు మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ చేయడం ప్రజలకు ఎంతో అవసరం అని మంత్రివర్గ ఉప సంఘం సూచన మేరకు ఈనెల 10న జరిగే మంత్రివర్గ సమావేశంలో పీలేరు రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం తెలపాలని కూటమి ప్రభుత్వాన్ని వీరు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పీలేరు చుట్టుపక్కల మండలాల ప్రజల మనోభావాలు గౌరవించి పీలేరు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ప్రభుత్వం ఎన్నికలవేళ ఇచ్చిన హామీ నేపథ్యంలో మదనపల్లి జిల్లాగా ప్రకటిస్తున్న వేళ ప్రధాన నగరాలైన తిరుపతి, చిత్తూరు, రాయచోటి ,మదనపల్లి ప్రాంతాలకు అతి దగ్గరగా ఉన్న అందరికీ సౌఖ్యవంతమైన పీలేరు రెవెన్యూ డివిజన్ గా ప్రకటిస్తే ఆయా శాఖల కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు అన్ని ప్రభుత్వ సేవలు సకాలంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఒంటిగంటకు రిలే నిరాహార దీక్ష శిబిరం వద్దకు బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.చంద్రశేఖర్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్ లు విచ్చేసి సంఘీభావం ప్రకటించి దీక్ష చేస్తున్న నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. అనంతరం పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా రేపు విజయవాడలో మంత్రివర్గ ఉప సంఘం సభ్యులను కలిసి పీలేరు రెవెన్యూ కేంద్రం చేయాలనే విషయంపై వినతి పత్రం సమర్పించాలని తీర్మానించడం జరిగిందని వీరు తెలిపారు. ఐదవ రోజు కొనసాగిన దీక్షలో మాల మహానాడు ఐక్యవేదిక రాయలసీమ జిల్లాల కన్వీనర్ చీకటపల్లి రామాంజులు, ఎండి పిఎస్ నాయకులు అమృతపురి మల్లికార్జున, వగళ్ల ఆంజనేయులు, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి గురవయ్య, పల్లె పోగు హరినాధ, దళిత నాయకులు తిమ్మయ్య, ప్రసాద్, నాగలేష్ ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి పల్లకి ఊరేగింపు

**లక్కిరెడ్డిపల్లి నవంబర్ 03, ప్రభాతవార్త**



లక్కిరెడ్డిపల్లి లోని అయ్యప్ప స్వామి మాలాదరణ గురు స్వాములు వెంకటరమణ వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మాలా దీక్ష పూజలు సోమవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహాన్ని గొల్లపల్లి నుంచి పల్లకిలో ఊరేగింపుగా బ్యాండ్ వాయిద్యాలతో బాలసంచాలతో అంగరంగ వైభవంగా తిరిగి యువత నాయకులు మోర్య రెడ్డి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యనమల మదనమోహన్ స్వామి వారిని పల్లకిలో ఊరేగింపుగా శ్రీ వెంకటేశ్వర దేవాలయానికి ఊరేగింపు తీసుకెళ్లారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మేనల్లుడు మోర్య రెడ్డి మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ దీక్ష లో పాల్గొని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి ఏటా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు మండలనికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు ఇక్కడే బస చేసి మూడు పూటలా భిక్ష ఏర్పాటు చేస్తున్నారు 41 రోజు ఇక్కడ బిక్ష ఏర్పాటు చేశార రెండు పూటలా దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు కార్యనిర్వాహక ధర్మకర్తలు, అయ్యప్ప భక్తులు భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి పడికట్ల పూజ



**పెనగలూరు నవంబరు 3 ప్రభాతవార్త**
పెనగలూరు మండలం మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడి కట్ల పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. కోదూరు శ్రీనివాసులు సరస్వతమ్మ నివాసంలో ఈ పూజా కార్యక్రమం జరిగింది. గురు స్వాములు నాగినేని మురళీకృష్ణ తాటిపోయిన వెంకటసుబ్బయ్య కోదూరు సుబ్బరామయ్యల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలలు శివమాలలు ధరించిన భక్తుల ఈ పూజలో పాల్గొన్నారు. ముందుగాఅయ్యప్ప స్వామి లోహ విగ్రహానికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలు పలు రకాల సువాసన పుష్పాలుతో వైభవంగా అభిషేక కార్యక్రమం జరిపించారు అనంతరం అయ్యప్ప స్వామి చిత్రపటానికి ఇరువైపులా విఘ్నేశ్వరుడు సుబ్రహ్మణ్యం స్వాముల నుంచి భక్తి పాటలతో కన్నుల పండుగగా పడికట్ల పూజ నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులు సరస్వతమ్మ దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప, శివ భక్తులకు అల్పాహార భిక్ష ఏర్పాటు చేశారు.

# అండర్ 19 ఖోఖో బాల బాలికల జట్ల ఎంపిక



**మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త**
మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అండర్ 19 ఉమ్మడి చిత్తూరు జిల్లా కో కో జిల్లా జట్ల ఎంపిక జరిగిందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు తెలిపారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ క లగిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి అండర్ 19 కోకో ఛాంపియన్షిప్‌లో జిల్లా జట్టు పాల్గొననుందని అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు, ఖో ఖో ఆర్గనైజర్ పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు నిరంజన్, సరిత, శేఖర్, లత, వరలక్ష్మి డివిజన్ స్థాయి కో ఆర్డినేటర్ బద్రయ్య, వ్యాయామఉపాధ్యాయులు. అన్సర్, సుధాకర్, బాలాజీ, మురళీధర్, దేవకమ్మలు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాల ప్రొఫెసర్‌కు డాక్టరేట్

**మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త**



పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డు నందు గల ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్. జె. ప్రదీప్‌కు డాక్టరేట్ ప్రధానం చేశారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పి.హెచ్.డి) పట్టా పొందినందుకు కళాశాల యాజమాన్యం చైర్మన్ ఆర్. రామ్మోహన్ రెడ్డి,ప్రెసిడెంట్ ఎన్. నాగ మల్లారెడ్డి, కళాశాల డైరెక్టర్. డాక్టర్. ఎస్. రామలింగ రెడ్డి, డాక్టర్. జె. ప్రదీప్ ని అభినందించారు. ప్రదీప్ డిజైన్ అండ్ అనాలసిస్ ఆఫ్‌లో పవర్ అన్లాగ్ ఫ్రంట్ ఎండ్ ఫర్ బయోమెడికల్ అప్లికేషన్స్" అనే అంశంపై శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్. తిరుమల రామశ్రీ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తయింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు ప్రదీప్ కి గౌరవ డాక్టరేట్, పి. హెచ్. డి పట్టా ప్రధానం చేశారు. డాక్టర్. జె. ప్రదీప్ విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలను సాధించాలని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్. పి. నాగసుబ్బరాయుడు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డాక్టర్. వి.వరప్రసాద్,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ప్రదీప్ కి అభినందనలు తెలిపారు.

# వైభవంగా కాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయంలో విశేష పూజలు



**బద్వేల్ అర్బన్ నవంబర్ 03 ప్రభాతవార్త :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్డు త్యాగరాజు కాలనీలో వెలిసిన శ్రీ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుండే స్వామి వారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు, తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, విశాలాక్షి అమ్మవారికి అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన తో పాటు పాలు రకాల ప్రత్యేక పూజలను శాస్త్రవేత్తకంగా నిర్వహించడం జరిగింది, అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామణ బోయిన మురళి యాదవ్ సతీమణి సునీత కుటుంబ సభ్యులు రామనుబోయిన పుల్లయ్య సతీమణి కృష్ణమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు, అన్న ప్రసాదం కు సహకరించిన వారికి స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు, అనంతరం పలువురు భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వంకెల పెద్దపోలి రెడ్డి, వైస్ చైర్మన్ పోకల రమణారెడ్డి కమిటీ సభ్యులు గాజుల నర్సింహులు (బాబు) పామూరు వెంకటేశ్వర్లు, తుపాకుల సాయిచరణ్, వడ్లబెట్టి బాలసుబ్రమణ్యం, లాస్తురి నాగరాజ్ సింగ్, ఆవులేటి వెంకటసుబ్బయ్య, బసవి ఆదెయ్య, ఆవుల వెంకటరమణ, మరియు కమిటీ సభ్యులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. అలాగే వార్త సర్కులేషన్ సీనియర్ మేనేజర్ నుమర్స్ వెంకటేశ్వరరావు సతీమణి నాగపార్వతి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



# అమ్మాయిల క్రికెట్ ఆట స్ఫూర్తిదాయకం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సుభహాన్

**పులివెందుల నవంబర్ 3 ప్రభాత వార్త :**
ప్రపంచ కప్ మహిళా క్రికెట్ విజేత భారత దేశ యువతుల ఆట స్ఫూర్తిదాయకం అని పులివెందుల పట్టణ ఎస్ ఐ సుభహాన్ పేర్కొన్నారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల చే నిర్వహించిన విజయోత్సవ ర్యాలీని ఎస్ఐ సుభహాన్,ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్ బాలనారాయణ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు కృష్ణారెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు సనావుల్లా,సేవాసమితి అధ్యక్షులు రాజు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో మహిళలు రాణిస్తూ ఉన్నారని, బాల్యం నుండి చదువుతో పాటు క్రీడల్లో కూడా వారికి తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రపంచ దిగ్గజాలు గా పేరు, ప్రతిష్టలు సంపాదిస్తారని ఈ ప్రపంచ కప్ క్రికెట్ మహిళా టీమ్ ఇండియా నిరూపించిందని తెలిపారు. ఈ జట్టు లో ప్రత్యేకంగా నిలిచిన మన కడప జిల్లా పులివెందుల ముద్దు బిడ్డ శ్రీ చరణి కి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. చరణి ని ప్రోత్సహించిన మామయ్య కిషోర్ కుమార్ రెడ్డి, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. 47 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ కు తెరదించిన ఈ విజయం 1983, 2011 ప్రపంచ కప్ విజయాల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ అధికారులు శ్రీనిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి, విద్య, స్కిల్‌లో విద్యార్థుల ప్రతిభ




**మైదుకూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**
సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో వృత్తి, విద్య విభాగం నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఘనంగా జరిగింది. హై స్కూల్లో మూడు వృత్తి కోర్సులైన, ఐటి మరియు ఐటిఈఎస్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ల కు చెందిన విద్యార్థులు పోటీలో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో వృత్తి శిక్షకులు సమన్వయం చేయగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇలియాస్ అహ్మద్ ప్రత్యేకంగా ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాన్ని వృత్తి శిక్షకులు బోడిపల్లి తేజ (బిఎఫ్ఎస్ఐ), జెర్రీ గురు మోహన్ (ఐటి మరియు ఐటిఈఎస్), మధురిమ (ఎలక్ట్రానిక్స్) సమన్వయం చేశారు. అన్ని ట్రేడ్ల బృందాలు తమ వర్కింగ్ మోడల్స్‌ను ప్రజెంట్ చేశాయి. పోటీ ఫలితాల ప్రకారం ఐటి మరియు ఐటిఈఎస్, ట్రేడ్ నుండి ఒక బృందం, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ నుండి ఒక బృందం మరియు బిఎఫ్ఎస్ఐ ట్రేడ్ నుండి రెండు బృందాలు జిల్లా స్థాయి స్కిల్ కాంపెటిషన్‌కు ఎంపికయ్యాయి. ఈ బృందాలు 07112025న జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు వృత్తి శిక్షకుల సమష్టి కృషిని అభినందించారు.

# పాఠశాలల బస్సులకు కండిషన్ తప్పనిసరి



**బద్వేలు, నవంబర్ 3, ప్రభాతవార్త**
పాఠశాలల విద్యనభ్యసించే చిన్నారులు మరియు భావి భారత పౌరులు ప్రయాణించే స్కూల్ బస్సులకు తప్పనిసరిగా అన్ని అర్హతలు ఉండాలని లేకపోతే అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు అన్నారు. సోమవారం పలువురు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం మరియు పాఠశాల బస్సు డ్రైవర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ డోర్స్ హేమర్స్ అండ్ ఫైర్ సిస్టం స్పీడ్ గవర్నర్ జిపిఎస్ ఫైర్ అల్లారం సిస్టమ్స్ మరియు బస్సు తోలుతున్న డ్రైవర్ కి కంపల్సరిగా అనుభవం ఉండవలెనన్నారు .డ్రైవర్ తాగి వాహనం తోలరాదనీ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్ మరియు క్లీనర్ వెంటనే స్పందించి ప్రయాణికులను మరియు విద్యార్థుల భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలెనన్నారు .పైన తెలిపిన అంశాలను సరిగ్గా పాటించాలనీ, లేనియడల వాహనమును సీజ్ చేస్తామని హెచ్చరించారు

# వాహనాలకు అంతరాయం లేకుండా సంత నిర్వహించుకోవాలి



**బద్వేల్ అర్బన్ ,నవంబర్ 3 , ప్రభాతవార్త**
బద్వేల్ పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మునిసిపల్ ఆఫీస్ పెట్రోల్ బంక్ పక్కన గల సంతలో రైతులు మాత్రమే సంత నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషన్ నరసింహారెడ్డి వారితో పేర్కొన్నారు. సోమవారం సంతను సందర్శించిన ఆయన పలువు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల కొరకే నిర్వహిస్తున్న ఈ సంత దళారులకు అడ్డాగా మారిందని మారిందని , దళారులను ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించరాదని రైతులకు సూచించారు. కేవలం రైతుల మాత్రమే సొంత లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారిని హెచ్చరించారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**దువ్వూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల గ్రామాలలో రోడ్లు దెబ్బతిన్నాయని అలాగే పారిశుద్ధ చర్యలు కూడా సక్రమంగా లేవని వెంటనే వీటిని చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ప్రజలు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం, రీ సర్వే కోసం దరఖాస్తులు అందజేశారు. వీటిని సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు పేర్కొన్నారు.



# శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం

**చిట్వేలి,నవంబర్ 3, ప్రభాతవార్త:**



కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా మండల పరిధిలోని శైవ క్షేత్రాలకు పెద్ద ఎత్తున భక్త జనం పోటెత్తారు. వేకువజాము నుంచి వేలాది మంది భక్తులు స్వామి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. కార్తీకదీపాలు వెలిగించి భక్తిని చాటారు. శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు అర్చకులు సురేంద్ర శర్మ ,పవన్ శర్మలు నిర్వహించారు. సాయంత్రం శ్యామలాంబ అమ్మవారికి జగన్మోహిని అలంకారాన్ని రాయి పెద్ది సతీష్ శర్మ ముగ్ధ మనోహరంగా చేపట్టారు. నక్కలపల్లి గ్రామంలోని శ్రీ భవాని శంకర స్వామి ఆలయంలో స్వామివారి మూల విగ్రహానికి విభూదితో అలంకరణ, ప్రత్యేక పూజలను అర్చకులు అరవింద్ శర్మ నిర్వహించారు. బాలకిషోర్ దంపతులు మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కర్కటేశ్వరునిగా ప్రత్యక్షంగా దర్శనమిచ్చు శ్రీ గుండాలకోనకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నదానాలు నిర్వహించారు. భక్తుల రద్దీని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో స్థానిక పిహెచ్సి వైద్యులు అన్సారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. పోలీసు, రెవెన్యూ, ఆరోగ్య వైద్య సిబ్బంది తమ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆర్టీసీ వారు బస్సు సర్వీస్ నడపడంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు సైతం శ్రీ గుండాల స్వామి దర్శనానికి తరలివచ్చారు. అన్నిచోట్ల ఆలయ పెద్దలు భక్తాదులందరికి అన్నదానాలతో పాటు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.



# కనకదుర్గమ్మ దేవాలయంలో కార్తీకమాస పూజలు




**బద్వేల్ అర్బన్ నవంబర్ 03 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలిసిన శ్రీ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో దుర్గా సమేత మల్లేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, తోపాటు పలు రకాల విశేష పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు సబ్ జైల్ సూపరిండెంట్ శ్రీహరి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పూరిబిండి అశోక్ కుమార్ రెడ్డి,మనోహర్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి, వడ్లపూడి నాగభూషణం దర్శి సుబ్బరాజాతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు. కనకదుర్గమ్మ అమ్మవారిని సీఐ లింగప్ప దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ లింగప్ప మాట్లాడుతూ కార్తీక మాసం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో పలువురు భక్తులు కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరమన్నారు, ప్రజలందరికీ కనకదుర్గమ్మ ఆశీస్సులతో అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

# ఘనంగా వీరభద్రుడికి కార్తీకపూజలు



**చాపాడు. నవంబర్ 3.ప్రభాత వార్త :**
కార్తీక మాసంలో శివ పూజలు జరిగేశైవ క్షేత్రాలలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం. కాలజ్ఞానవేత్త శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి స్వయంగా శిల్పం చెక్కి ప్రతిష్టించిన పుణ్యక్షేత్రం, కార్తీక మాసంలో ప్రతి సోమవారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహిస్తూ ఉంటారు. సోమవారం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు ఇతర ప్రాంతాల నుండి కూడా వేకువజాము నుండే స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్నారు. వేకువజామునుండి మహిళలు గుడి ఆవరణము నందు కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఆలయ కార్య నిర్వహణ అధికారి శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో మాడవీధులలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకొట్టుకున్నాయి. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# ప్రమాణ స్వీకారానికి విచ్చేయండి

## మంత్రిని కలిసిన చైర్మన్

**మదనపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త**



ఈనెల 13న జరిగే మార్కెట్ యాడ్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి విచ్చేయండంటూ సోమవారం తిరుపతిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని చైర్మన్ జంగాల శివరాం కలిసి కోరారు. మదనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రిని రమ్మని ఆహ్వానించడం జరిగిందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ సెక్రటరీ గజ్జల రెడ్డప్ప, మదనపల్లి టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, మదనపల్లి టౌన్ సెక్రటరీ నవాజ్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా వస్తానని చెప్పినట్లు తెలిపారు.

# జాతీయ స్థాయి క్రీడా పోటీలకు హైస్కూల్ విద్యార్థి

**గాలివీడు, నవంబర్ 3(ప్రభాతవార్త):**



జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు గాలివీడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.మొహమ్మద్ ఆయూబ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ గంగరాజు, ప్రధానోపాధ్యాయులు కె.జాఫర్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండలో ఈ నెల 2, 3వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలలో మహమ్మద్ ఆయూబ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం ఆయూబ్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు

| కడప జిల్లా | అన్నమయ్య జిల్లా |
|---|---|
| లింగాల, కమలాపురం, యర్రగుంట్ల, పోరుమామిళ్ల, బద్వేలు రూరల్, కొండాపురం, నందలూరు, ఓబులవారిపల్లె, రరైల్వేకోడూరు | రామాపురం, వీరబల్లి, గుర్రంకొండ, కలకడ, వాయల్పాడు, మొలకలచెరువు, చక్రాయపేట, బి.కొత్తకోట |

ఇంటర్వ్యూ తేది : 06.11.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086